క్లుప్తంగా

ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలన్నదే సీఎం తపన



73వ వార్డులో పట్టాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ సుజాత

గాజువాక : ప్రతి పేదవాడికీ సొంతిల్లు ఉండాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తపన పడుతున్నారని 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత అన్నారు. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. 73వ వార్డులో కొత్తగా మంజూరైన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో అత్యధిక మందికి పట్టాలు మంజూరయ్యాయన్నారు. వార్డు నాయకుడు అలీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు చీరల పంపిణీ

అగనంపూడి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతిని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పూర్ణ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా 4వందల మంది నిరుపేదలకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతుల మీదుగా చీరలు పంపిణీ చేయనున్నట్లు పూర్ణ తెలిపారు.

పరిసరాల శుభ్రతతో డెంగ్యూ దూరం



ర్యాలీ చేస్తున్న మలేరియా సిబ్బంది

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో శుక్రవారం డెంగ్యూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా జిల్లా మలేరియా అధికారి ఎం.తులసి ఆదేశాల మేరకు గాజువాక మలేరియా యూనిట్ సీనియర్ ఎంటమాలజిస్ట్ కె. వరహాలదొర పర్యవేక్షణలో పలు సెక్టార్లలో ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్లు కుమార్, నాయుడు,పబ్లిక్ హెల్త్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రికి సమస్యను వివరిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం సీఐటీయూ విశాఖ జిల్లా ప్రతినిధులు మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. మిందిలోని మంత్రి నివాసంలో ఆయన్ను కలిసి సమస్యలు వివరించారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి నిధులు దారి మళ్లిస్తున్నారని తెలిపారు. మంత్రి మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై క్యాబినెట్‌లో వివరిస్తానని చెప్పారని వారు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా నాయకులు వెంకట్రావు, బి.శ్రీను, అనసూయ, డి.రమణ, టి.శ్రీను, రాజారావు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పరిశోధకుడిగా గొన్నా అధ్యాపకుడు



ఓమ్ నమఃశివాయను అభినందిస్తున్న గొన్నా కళాశాల యాజమాని హేమచంద్

అగనంపూడి: బిజినెస్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్‌లో గొన్నా ఎంబీఏ విభాగం హెచ్‌వోడీ బి.ఓం నమఃశివాయ పరిశోధనలు చేసి.. స్టార్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ అవార్డును దక్కించుకున్నారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన్ని సత్కరించారు. కళాశాల యజమాని గొన్న హేమ్‌చంద్ నాయుడు, ప్రిన్సిపాల్ మూర్తి పాల్గొన్నారు.

ప్రజలకు మరింత లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 67, 68 వార్డుల్లో 'జగనన్న సురక్ష'



67వ వార్డులో దరఖాస్తుదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



68వ వార్డులో దరఖాస్తుదారుకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



68వ వార్డులో జగనన్న సురక్ష కార్యక్రమానికి హాజరైన ప్రజలు

గాజువాక : ప్రజలకు మరింత లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 67వ వార్డులోని ఐదు సచివాలయాల పరిధిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువపత్రాలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. దరఖాస్తుదారులకు సత్వర సేవలను అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. కొన్ని సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లను వలంటీర్లే దరఖాస్తుదారుల ఇళ్లకు తీసుకెళ్లి ఇచ్చే విధంగా ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారన్నారు. ముఖ్యమంత్రి ఏ హామీ ఇచ్చినా దాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తారని, దానికి ప్రతిరూపమే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు అని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు 100 హామీలిచ్చి ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు చెప్పని హామీలను కూడా అమలు చేశారని పేర్కొన్నారు. ఈ పథకాలను మరింత ముందుకు తీసుకెళ్లడం కోసం జగన్ మోహన్‌రెడ్డిని భవిష్యత్‌లో కూడా ముఖ్యమంత్రిగా దీవించాలని కోరారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో గాజువాక జెడ్సీ పి.సింహాచలం, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్‌బాబు, రెవెన్యూ ఆఫీసర్ సీహెచ్.రామనారాయణ, సచివాలయ కన్వీనర్లు ఎస్ఎండీ గౌస్, రాజాన వెంకటరావు, నాయకులు పల్లా పెంటారావు, సూర్యనారాయణ, మీరా, అన్నపూర్ణ, లక్ష్మి, కాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

68వ వార్డులో 310మందికి సర్టిఫికెట్లు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం, మిందిలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తుదారులకు ఎమ్మెల్యే నాగిరెడ్డి ధ్రువపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా చేసిన రాష్ట్రానికి ఒక్క మంచిపని కూడా చేయని చంద్రబాబు సీఎం జగన్‌ను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితం అడ్డదారిమయమన్నారు. మామను వెన్నుపోటు పొడిచి పార్టీని లాక్కున్నారని విమర్శించారు. మూడు సార్లు అధికారంలోకి రావడానికి అన్ని పార్టీలతో కలిసి పోటీ చేశారన్నారు. ఇప్పుడు కూడా దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, కమ్యూనిస్టులు, బీజేపీ, కాంగ్రెస్ నాయకుల కాళ్లు పట్టుకొని అధికారంలోకి రావడానికి నానా తంటాలు పడుతున్నాడన్నారు. సచివాలయాలు, వలంటీర్లు దండగ అని మాట్లాడుతున్నారని, కానీ వలంటీర్లు కష్టకాలంలో తలుపు తట్టి ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. చంద్రబాబుకు ఎన్నో పత్రికలు, మీడియాలు అండగా ఉండి అబద్ధాలను వండి వార్చుతున్నాయన్నారు. కానీ జగన్‌మోహన్ రెడ్డి పైన దేముడిని, ప్రజలను నమ్ముకున్నాడన్నారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. జెడ్సీ పి. సింహాచలం మాట్లాడుతూ వార్డులో వివిధ సర్టిఫికెట్ల కోసం 427 మంది దరఖాస్తు చేసుకోగా 310 మందికి సర్టిఫికెట్లు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, తహసీల్దార్ పాల్ కిరణ్, డీటీ భుజంగరావు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నాయకులు మహ్మద్ గౌస్, వరదాడ వెంకటరమణ, సంద్రాన నూకరాజు, గొంతిన వెంకటలక్ష్మి, బోనెల జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించారు



వడ్లపూడి సీడబ్ల్యూసీ ఎదురుగా ఉన్న కాలువపై నిర్మించిన కల్వర్టు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్ ఎదురుగా ఉన్న కాలువపై కల్వర్టు నిర్మాణాన్ని కాంట్రాక్టర్ శుక్రవారం పూర్తి చేశారు. వడ్లపూడి సీడబ్ల్యూసీ ఎదురుగా ఉన్న రోడ్డుపై కాలువ నిర్మాణ పనులను పూర్తి చేసినప్పటికీ దానిపై కల్వర్టు నిర్మాణం పూర్తి చేయలేదు. దీంతో స్థానికులు రాకపోకలకు చాలా ఇబ్బంది పడేవారు. ఈ సమస్యపై ఈ నెల 7వ తేదీన «కాంట్రాక్టర్‌కు ఖాళీ లేదట» శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. కాంట్రాక్టర్‌ను ఆదేశించి, సచివాలయ అధికారులు దగ్గరుండి కల్వర్టు నిర్మాణాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు. నెలల తరబడి ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్రం కుటిల నిర్ణయాలపై ప్రజా వ్యతిరేకత

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అన్ని పరిశ్రమల వద్ద దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కుటిల నిర్ణయానికి ప్రజామోదం లేదనడానికి ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతే నిదర్శనమని అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 876వ రోజు పలువురు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని, నిరసన తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



గణేష్ భార్యకు రూ.2.30 లక్షలు అందిస్తున్న పూర్ణ

అగనంపూడి: కిడ్నీ వ్యాధితో మృతి చెందిన ఆటో డ్రైవర్ కుటుంబానికి దిబ్బపాలెం డీఎస్ఎస్ యూత్ అండగా నిలిచింది. అగనంపూడి నిర్వాసిత కాలనీ దిబ్బపాలేనికి చెందిన పెంటపల్లి గణేష్ కిడ్నీలు పాడవడంతో కొన్నేళ్లుగా మంచానికే పరిమితం అయ్యాడు. దాతలు, వివిధ సంస్థల ఆర్థిక సహకారంతో వైద్య సేవలు పొందిన గణేష్ ఇటీవల మరణించాడు. దీంతో స్పందించిన గ్రామానికి చెందిన డీఎస్ఎస్ యూత్ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. సేకరించిన మొత్తం రూ.2లక్షల 30వేల నగదును రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి. పూర్ణానందశర్మ చేతుల మీదుగా గణేష్ భార్యకు, తల్లికి అందించారు. నాయకులు యలమంచిలి అప్పారావు, కమిటీ ప్రతినిధులు యలమంచిలి కృష్ణ ప్రసాద్, చిక్కాల బుజ్జి, ఇల్లపు కొండలరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



లబ్ధిదారులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: నిరుపేదలకు అండగా, మధ్యతరగతి ప్రజలకు భరోసా కలిగించేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగుతోందని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 85వ వార్డు ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ఆయన మాట్లాడుతూ ప్రతీ అర్హునికి పథకాల ఫలాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, నాయకులు ఇల్లపు ప్రసాద్, ఏదూరి రాజేష్, బోర సోమునాయుడు, యలమంచిలి చిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా దుర్గాదేవి



అగనంపూడి దుర్గాలమ్మ ఆలయంలో..



శాకంబరిగా విజయ దుర్గాదేవి

అగనంపూడి: ఆషాడమాసం పంచమి సందర్భంగా అగనంపూడిలోని దుర్గాలమ్మ వారు శాకంబరిగా, అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి సభ్యులు లలిత, విష్ణు సహస్ర పారాయణం చేశారు.

75వ వార్డులో..

పెదగంట్యాడ: 75వ వార్డు కండిపల్లి వారి వీధిలో కొలువుదీరిన విజయ దుర్గాదేవి శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

విద్యార్థి దశ నుంచే నాయకులుగా ఎదగాలి



విద్యార్థి నాయకులను అభినందిస్తున్న పాఠశాల ప్రతినిధులు

గాజువాక : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఓక్‌వ్యాలీ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ ఎ.బాలరెడ్డి విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థి నాయకులను శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారికి బాధ్యతలను అప్పగించారు. విద్యార్థులు పెరేడ్, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. అకడమిక్ డైరెక్టర్ ప్రణయ్ దీప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఐ.కోమలిదేవి, డీన్ ఫిలోమిన, ప్రీతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు రైల్వే డివిజన్‌లో భద్రత తనిఖీలు



ట్రాక్‌లను పరిశీలిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్

తాటిచెట్లపాలెం: గోపాలపట్నం, సింహాచలం రైల్వే స్టేషన్ల పరిధిలో శుక్రవారం డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి భద్రత తనిఖీలు చేపట్టారు. డివిజన్ పరిధిలో ప్రతీ సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించి.. పూర్తిస్థాయి తనిఖీలు చేపట్టనున్నట్లు డీఆర్ఎం తెలిపారు. భద్రత ప్రమాణాలు, ప్రోటోకాల్స్‌పై సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్.నాయుడు, సింహాచలం ఆటో యూనియన్ ప్రతినిధులు డీఆర్ఎంను కలిసి పలు సమస్యలను వివరించారు.

అండర్ బ్రిడ్జిల విస్తరణకు వినతి

అగనంపూడి: అగనంపూడి నిర్వాసితకాలనీ తలారివానిపాలెం నుంచి దువ్వాడ, మంగళపాలెం, జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలకు వెళ్లే మార్గంలోని మూడు అడుగుల వెడల్పులోని అండర్ బ్రిడ్జిని విస్తరించాలని అగనంపూడి నాయకులు డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతికి వినతిపత్రం అందించారు. కార్పొరేటర్ మొల్లి ముత్యాలు నాయుడు, అగనంపూడి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ పరిధిలో ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. రేంజర్ ఫోర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మనం–వనం అంశంపై నిర్వహించిన పోటీల్లో 4 నుంచి 9వ తరగతికి చెందిన 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు బహుమతులను అందజేస్తారని పాఠశాల డ్రాయింగ్ టీచర్ బి.రవిచంద్, ఇన్‌చార్జి హెచ్ఎం జి.కుమార స్వామి తెలిపారు. సచివాలయ ఎడ్యుకేషనల్ సెక్రటరీ శాంత్ రాజు, ఉపాధ్యాయులు దేముళ్లు పాల్గొన్నారు.

నిర్వాసిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్ఎల్‌సీ మహంతి, అధికారి గోవిందను సత్కరిస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ స్టోర్స్ విభాగంలో పని చేస్తున్న నిర్వాసిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఉక్కు శ్రామిక సంఘం నాయకులు రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ)ఎం.జె. మహంతిని కోరారు. నగరంలో శుక్రవారం ఆయన్ను కలిసిన నాయకులు కార్మికుల సమస్యలను వివరించారు. ఆ విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు ఎనిమిది నెలల నుంచి గేటు పాసులు ఆపివేసి ఉపాధి లేకుండా చేశారన్నారు. ప్లాంట్‌లో పని చేస్తున్న నిర్వాసిత కార్మికులకు ఫుల్ అండ్ ఫైనల్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల ఎక్స్‌గ్రేషియా ఒప్పందానికి సహకరించినందుకు గాను ఆర్ఎల్‌సీ మహంతి, సమన్వయ అధికారి ఎ.గోవిందలను సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు, పంచదార్ల పెంటారావు, హెచ్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి 87వ వార్డు సమస్యలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వార్డులో నెలకొన్న పలు ప్రజాసమస్యలపై స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డులో యూజీడీ వ్యవస్థ అందుబాటులోకి తేవాలని, కళింగవీధిలో పార్కులో వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, ప్రగడ శ్రీనివాస్, మార్పు శేషు తదితరులున్నారు.

వాంబేకాలనీలో కార్పొరేటర్ పర్యటన

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీలో కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు శుక్రవారం పర్యటించారు. నాయకులతో కలసి కాలనీలోని అన్ని బ్లాక్‌లలో తిరిగారు. కాలనీలో డ్రైనేజ్, మంచినీటి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యే నాగిరెడ్డితో కలసి మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. లోకనాథం, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీను, జుత్తు లక్ష్మి, మంత్రి మంజుల పాల్గొన్నారు.

శుక్రవారం డ్రై డే పాటించాలి

అగనంపూడి: ప్రతీ శుక్రవారం ఇళ్లలో, పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించి, డ్రైడే పాటించాలని జెడ్సీ సింహాచలం సూచించారు. 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1లో చేపట్టిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నిర్మూలనకు జీవీఎంసీతో సహకరించాలని కోరారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ గంధ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ బానిసత్వం

- సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు
- కుటుంబాలతో సహా అదాని కార్మికుల పాదయాత్ర



కుటుంబాలతో పాదయాత్ర చేస్తున్న కార్మికులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో కార్మికులకు బానిసత్వం అమలవుతోందని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద గల స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కాస్తా ప్రధాని ప్రదేశ్‌గా మారిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. కార్మికులకు వెంటనే జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే విధుల నుంచి తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. అంతేకాకుండా 29 మంది కార్మికులపై విధించిన ఆంక్షలను ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు లోకనాథం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేఎం శ్రీనివాసరావు, ఎం.రాంబాబు, నమ్మి రమణ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్ తదితరులు మాట్లాడారు. దీక్షా శిబిరం నుంచి కొత్త గాజువాక, గాజువాక మెయిన్‌రోడ్డు, పాత గాజువాక జంక్షన్ వరకూ కార్మికులు కుటుంబ సభ్యులతో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, జెర్రిపోతుల ముత్యాలు, కొవిరి కోదండరావు, ఎం.రాంబాబు, పల్లేటి పోలయ్య, పితాని భాస్కర్, ఉమ్మిడి అప్పారావు, నొల్లి తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ, అమ్మోరు, మాద అప్పారావు, కదిరి భూలోక రావు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన



ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి జాబ్ మేళాను ప్రారంభించారు. 900 మంది అభ్యర్థులు హాజరు కాగా, 300మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. మొత్తం 12 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు. ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ రెండు నెలలకోసారి జాబ్ మేళాను నిర్వహించనున్నామని తెలిపారు. యువత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు చైతన్యరెడ్డి, రోహిణి, రమేష్‌నాయుడు, వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, జగదీష్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, స్కిల్ డెవలప్‌మెంట్ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.